# మనసు

## శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య

"అరవై యేళ్లు దాటి, రిటైరయిన తర్వాత బ్రతికి వుండడమే పెద్ద తప్పు..." అనుకున్నాను నేను చిరాకుతో, ఆ ఫోటో ముందు కూర్చుని పగిలిపోయిన అద్దం పెంకులను ఏరుతూ.....

పెద్ద అవసరం వచ్చిన వాడిలా కుర్చీ వేసుకుని మరీ పైకి ఎక్కి దాన్ని క్రింద పడేసిన కుర్రవెధవ నా ప్రక్కనే కళ్లు పెద్దవి చేసుకుని చూస్తూ నిలబడ్డాడు. గాజు పెంకులను ఏరుతూవుండగా ఒక బ్లేడువంటి గాజు ముక్క వ్రేలికి గీరుకుపోయి నా చిరాకును సహస్రాధికం చేసింది. గారడీ చూస్తున్న వాడిలా నిలబడిన ఆ కుర్ర వెధవను ఉద్దేశించి కోపంగా "నువ్వు అవతలికి పో ముందు" అని అరిచాను. వాడు బొత్తిగా భయ భక్తులు లేని శుంఠ... అనవసరంగా నవ్వుతూ నన్ను మరింత ఉడికిస్తూ లోపలికి వెళ్లాడు.

చాలా ఓపికగా గాజు పెంకులు ఏరి బయట పారబోసి ఆ ఫోటోను చేతిలో వుంచుకుని వాలుకుర్చీలో కూలబడ్డాను. మనసంతా ఎవరిమీదో, ఎందుకో తెలియని ఉక్రోషంతో, కసితో నిండి పోయివుంది.

నేను ఏళ్లతరబడి పెద్ద పదవిలో ఠీవిగా, దర్జాగా కాలం గడిపి సంవత్సరం క్రిందటనే రిటైరయినాను. అంతకాలమూ మధ్యందిన మార్తాండునివలె ఒక వెలుగు వెలిగాను. అయినా ఎప్పటికీ సూర్యుడలా నడినెత్తినే ఉండి పోవడం సాధ్యం కాదు గదా! ఈ సూర్యుడు ఉద్యోగ విరమణ చేసి పెన్షన్ తీసుకోవలసి వచ్చింది. సరే, తప్పదు కాబట్టి సోమరిగా యింటి పట్టున కూర్చుండి పోయాను. కాని నాకు మనశ్శాంతి లేదు. వారం రోజుల నుంచీ యీ వానర సేన వచ్చిపడింది. దానితో మరీ చీకాకు పడిపోతున్నాను.

'వానరసేన' లోపల హడావిడి చేస్తున్నది. వాళ్ళు మొత్తం ఆరుగురు. అందరికన్నా పెద్దవాడు రాజు. మా పెద్దమ్మాయి కొడుకు. ఫిఫ్త్‌ఫారం పరీక్షల వ్రాసి వాడు సెలవుల్లో యిక్కడికి వచ్చాడు. జుట్టు మొహం మీద పడుతూవుండగా ఎప్పుడూ గంభీరంగా ఏదో ఆలోచిస్తూ వుంటాడు. మొదట్లో ఏ వేదాంతిగానో తయారవుతాడని అనుకున్నాను కాని వాడు నా అంచనాలన్నీ తలక్రిందులు చేసి 'మెకానిక్' గా తయారైనాడు. ఎప్పుడూ ఎలక్ట్రిక్ బల్బులు తీసి మళ్లీ పెట్టడం, ఫ్యూజులు పోతే వెయ్యడం, వైరుతో ఏవేవో పనులు చేస్తూ వుండటం, ఫ్యానులూ, రేడియోలూ, విప్పి మళ్లీ బిగిస్తూ వుండటం యిటువంటి పనులలో వాడు ఆరితేరిన వాడు. మును పెప్పుడో ఒకసారి సెలవులకు వచ్చి వాడు యిక్కడే వుండగా ఒక రోజు రాత్రి అందరూ

భోజనాలముందు కూర్చున్న వెంటనే ఫ్యూజు పోయింది కాబోలు లైట్లు టప్పున ఆరి పోయాయి. ఇల్లంతా అంధకారం అలుము కున్నది. అప్పుడు వాడు పెద్దగా "ఎవరూ కదలకండి. ఒక్క క్షణంలో అంతా సరి చేస్తాను." అంటూ తన పెట్టె దగ్గరికి వెళ్లి టార్చి తీసుకుని పనిముట్లు తీసు కొని వెళ్లి క్షణంలో లైట్లు వెలిగించాడు. అప్పుడు నా కొడుకూ, కోడలూ, నా మూడో కూతురూ, మా ఆవిడా వాణ్ణి తెగమెచ్చు కుని ఒకటే మురిసి పోవడం... దాంతో వీడు గొప్ప వినయం నటిస్తూ "మీరు నన్నంతగా పొగడకండి. నేను నా ధర్మం నెర వేర్చానంతే" అన్న ధోరణిలో మాట్లాడటమూ నాకు బొత్తిగా నచ్చలేదు. తేలికగా చప్ప రించి "ఈ పనులకు బాగానే పనికొచ్చే ట్టున్నావు. ఇంకేం ? చదువు మానేసి స్క్రూ డ్రైవర్లూ, రెంచీలూ పట్టుకుని యిళ్లవెంట తిరగడం మంచిది. మీ అమ్మకూ నాన్నకూ ఈ చదువు పేరుతో డబ్బుదండగ ఎందుకు ?" అన్నాను. అలా అని వాడి మొహం వంక చూసి గతుక్కు మన్నాను. వాడు ఆ మాటలు విని కూడా పరమహంస లాగా చిరునవ్వు నవ్వుతూ కూర్చున్నాడు. పైగా మా ఆవిడ మనుమడిని వెనక వేసు కుని వస్తూ "చాల్లెండి.... ఏంమాటలండీ మరీనూ ? ఇవాళ అన్నాలవేళా చీకట్లో చిందులాట తప్పించాడు బంగారు తండ్రి... వాడికి పనిముట్లు పట్టుకుని యింటింటికీ తిరగవలసిన ఖర్మ పట్ట లేదు.... వాడు ఏ కలెక్టరో అయి తీరుతాడు. చదువులో మాత్రం వాడు వెనుక బడ్డాడను కుంటు న్నారేమో! అల్లుడు నాతో చెప్పాడు... వీడే క్లాసులో అన్నింటా ఫస్టుట...పైగా ఇలా లైట్లు పోతే ప్రతిసారీ ఎవరోవచ్చి బాగు చేసి పొయ్యేవరకూ గతిలేదు... ఒక్కోసారి పూటల తరబడి లైట్లు లేక బాధ పడ లేదూ మనం ? మళ్లీ చూడబోతే యింట్లో అందరూ బి. ఏ. లూ ఎం. ఏ.లూ ప్యాసై ఉద్యోగాలు చేస్తున్నారు. వెధవది ఫ్యూజు పోతే వేసే దిక్కులేదు...." అంటూ పెద్ద దండకం చదివింది. వాడు ఆమెను పూర్తిగా మాట్లాడనిచ్చి "నువ్వూరుకో అమ్మమ్మా! తాతయ్య ఏదో అన్నాడే అనుకో.... పెద్ద వాడు.... ఆయన అలా దీవిస్తేనే మంచిది" అన్నాడు. దానితో మిగిలిన వాళ్లంతా విరగ బడి నవ్వడం, నాకు మతిపోయినంత పన యింది.

లోపల చరిత్రగతిని మార్చివేసే యుద్ధం వంటిదేదో జరుగుతున్నది. గబ గబా లేచి వెళ్లాను. ఒకరి మీద ఒకరు పడి దొర్లుకుంటూ రొప్పుతూ రొజుతూ పోట్లాడు కుంటున్నారిద్దరు. ఆ యిద్దరికీ ఏడో సంవత్సరం నడుస్తున్నది. ఒకడు మా అబ్బాయి రాజశేఖరం కొడుకు. మరొకడు మా పెద్దమ్మాయి రెండో కొడుకు. నేను ఇద్దరినీ చెరొరెక్కా పుచ్చుకుని విడదీసి "వెధవల్లారా! ఎందుకలా కొట్టుకు ఛస్తు న్నారు ?..." అని అడిగాను. వారిలో ఒకడు నవ్వుతూ "ఊరికే తాతయ్యా! వాడు కుస్తీపడదాం రమ్మన్నాడు..సరేనన్నాను. అంతే" అన్నాడు. నాకు ఒళ్లు మండి పోయింది. ఉక్రోషం కొద్దీ చెరొకటి అంటించి "పొండి గాడిదల్లారా?" అంటూ మళ్లీ హాల్లోకి వచ్చి కూలబడ్డాను. ఆ ఫోటో చేతిలోకి తీసుకున్నాను. అందులో మా కుటుంబం అంతావుంది. పిల్లలు మినహా మొత్తం ఏడుగురు. మా పెద్దబ్బాయి పెళ్లినాటి

ఫోటో అది. వాడి పేరు రాజశేఖరం. ఎమ్. ఇ. ప్యాసై ఇక్కడే పని చేస్తున్నా డిప్పుడు. వాడి భార్య హైస్కూల్లో టీచరు. ఆమె పేరు రమ. ఆమె అంటే నాకు చాలా అభిమానం. ఆ ప్రక్కనే వున్నది మా పెద్దమ్మాయి సుజాత. ఆమె భర్తతో సహా భిలాయ్‌లో వుంటున్నది. అప్పుడప్పుడు తప్ప తరచుగా యిక్కడికి రాదు. ఆమె ప్రక్కనే రెండు జడలు గుండెల మీదకి వేసుకుని వున్నది వనజ. మా రెండో కూతురు. ఆమె భర్త బెంగుళూరులో కాలేజీ లెక్చరరు. ఆమె దగ్గరి నుంచి నాలుగు నెలల క్రిందట ఉత్తరం రాగానే మా ఆవిడ ఒకటే సంబర పడిపోతూ వెళ్లిందక్కడికి. 'కాన్పుకు పుట్టింటికి పంపవయ్యా అంటే, అల్లుడు 'ఇదేం మొదటి కాన్పు కనుకనా ? ససేమిరా వీల్లేద'న్నాడుట. అందుకని ఆమె నామానాన నన్నొదిలేసి తను అక్కడే ఉండి పోయింది. పైగా అభిమానం అంతా ఒలకబోస్తూ మూడు రోజులకో ఉత్తరం రాసి పడేస్తుంది. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమని నాకూ నన్ను జాగ్రత్తగా చూసుకోమని మిగిలిన వాళ్లకూ...హితబోధలు చేస్తుంది. మా మూడో అమ్మాయి ఫోటోలో మూతి చిత్రంగా పెట్టింది. బహుశా ఎవరినన్నా వెక్కిరిస్తున్నదేమో! ఆమె కింకా పెళ్లికాలేదు. 'పెళ్లి' సంగతి ఎత్తినప్పుడల్లా అందర్నీ దులిపేస్తూ వుంటుంది. ఆ ప్రసక్తి తెచ్చామో ఖర్మ కాలిందన్నమాటే. ఒక పెద్ద తుఫాను... ఉప్పెన...వొచ్చిపడినట్లే. హక్కులు, స్వాతంత్ర్యం, కాళ్లమీద నిలబడటం, ఈ పదాలు వందలూ వేలుగా ఆమె నోట్లో నుంచి నిజంగా ఉప్పెనలాగేవచ్చి మనలను ముంచెత్తివేస్తాయి. కాని, దాని తెలివి తేటలు నన్ను ఎల్లప్పుడూ ముగ్ధుణ్ణి చేస్తూ వుంటాయి. అది ఈ యేడుకే ఎం. ఏ. ప్యాసై స్థానిక స్త్రీలకళాశాలలో లెక్చరరుగా వుంటున్నది. పైగా అడపాదడపా వ్యాసాలూ, కథలూ వ్రాసి కొంత పేరుతెచ్చుకున్నది కూడా.

నేను ఫోటో ప్రక్కనేవుంచి నిట్టూర్చాను. ఏమీ తోచడంలేదు. ఇప్పుడేకాదు. ఉద్యోగ విరమణ చేసిన ఆ క్షణంనుంచీ నాకు ఏమీ తోచడంలేదు. కాకపోతే మా ఆవిడ ఉండగా కొంత మనశ్శాంతి ఉండేది. ఆమె ఆదరణలో అన్నీ మరిచిపోయి విశ్రాంతి తీసుకునేవాణ్ణి. పెద్ద నిద్రగన్నేరు నీడలా ఆమె నన్ను సేద దీర్చి మనసుకు విశ్రాంతీ, ఆహ్లాదమూ కలిగించేది. పైగా యీ వానరసేన లేకపోతే యిల్లంతా నిశ్శబ్దంగా ఉండేది. అటూయిటూ హడావిడిగా ఎగురుతూ పిచ్చుకలుచేసే సవ్వడి తప్ప మరే శబ్దమూ వినిపించేదికాదు. హాయిగా దినపత్రిక చేతిలోకి తీసుకుని ప్రత్యక్షరమూ చదివి ఆనందిస్తూ ఉండేవాణ్ణి. అందువల్ల అనేక దేశాలు తిరిగినట్టూ, అనేక విషయాలు చూసినట్టూ అనుభూతి కలిగేది. ఈ వానర సేనవచ్చి పడినప్పటినుంచీ అదీ వీలుపడటం లేదు. పేపరు చేతిలోకి తీసుకునేసరికి ఏదో రొద, గొడవ ప్రారంభం.....దానితో చదువు ముందుకు సాగదు.

ఉదయం తొమ్మిది గంటలకే యింట్లో వంటా వార్పూ అయిపోతుంది. తొమ్మిదిన్నర కల్లా మా మూడో అమ్మాయి పుస్తకాలు తీసుకుని చెప్పులు చప్పుడు చేసుకుంటూ కాలేజీకి వెళ్లిపోతుంది. తొమ్మిది ముప్పావు అయ్యేసరికి రాజశేఖరం టై సర్దుకుంటూ, బూట్లు చప్పుడు చేసుకుంటూ వెళ్లి స్కూటర్ స్టార్టుచేసి హారన్ మ్రోగిస్తాడు. లోపలి

గదిలోనుంచి "వొస్తున్నాను సార్! కొంచెం గుర్రాన్ని కట్టేయండి......" అని సమాధానం చెప్పి మా కోడలు బయలుదేరివచ్చి "స్కూలుకు వెళ్తున్నాను మామయ్యా!" అని నా అనుమతి కోసమే అన్నట్టు ఒక్క క్షణం నిలబడుతుంది. నేను నవ్వుతూ తల వూపుతాను. అప్పు డామె భర్తతోపాటు స్కూటర్‌మీద స్కూలుకు వెళ్లిపోతుంది. పరాయి యింట బుట్టిన పిల్లఅయినా కోడలు అంటే నా కందుకే అభిమానం......ఆమెకు తప్ప ఎవరికీ యింట్లో 'ముసలి ముండావాడు పడివున్నాడు; కనీసం చెప్పి వెడదా'మనే జ్ఞానం బొత్తిగాలేదు.

అలా పది కొట్టేసరికల్లా అందరూ ఎవరిపాటికి వారు బయలుదేరి వెళ్లిపోతారా? నేనొక్కణ్ణే యింట్లోమిగిలిపోతాను. చేసేందుకా పని ఏమీ ఉండదు. నిద్రపోదామంటే ఎంత ప్రయత్నించినా కళ్లు మూతలుపడవు. నా భార్య గుర్తుకువస్తుంది. చిరునవ్వులుచిందే ఆ ముఖం......వయస్సుమళ్లినా తగ్గని శరీర లావణ్యమూ......నా పట్ల నెరపిన ప్రేమాభిమానాలూ గుర్తువచ్చి ఆమె లేని బాధను మరింతఎక్కువ చేస్తాయి. అప్పుడు నాహృదయంలోని బాధనంతటినీ కాయితంమీద వ్రాసి ఆమెకు ఉత్తరం పోస్టు చేద్దామనిపిస్తుంది. నాలుగురోజుల క్రిందట వ్రాసిన ఉత్తరంలో "నువ్వు లేకపోవడంవల్ల నేను పడుతున్న బాధ ఎలా చెప్పను? ఇక్కడ ఎవరూ, నన్నూ నా ఉనికినీ గుర్తించడమేలేదు. కేవలం కాపలాకుక్కలాగా యింట్లోపడివుంటున్నాను. ఇంకా నువ్వు రావెందుచేత? అమ్మాయి ప్రసవించి ఇన్నాళ్లయినా నువ్వురాని కారణం ఏమిటి? నువ్వు కూడా యీ రిటైరయిన ముసలివాణ్ణిమరచిపోతున్నట్టున్నావు" అని వ్రాశాను. దానికి సమాధానంలేదు. నిజమేమరి......ఎవరికిమాత్రం నా మీద గౌరవం ఎందుకుంటుంది? అందరూ సంపాదనపరులైనారు. ఆడా, మగా అందరూ ఎవరిపాటికి వారు ఉద్యోగాలుచేసి స్వతంత్రంగా డబ్బు సంపాదిస్తున్నారు. మావాడికేమో అయిదు వందలుపైమాటే జీతం...... కోడలికేమో రెండువందలకు తక్కువఉండదు. మా మూడో అమ్మాయికి సరేసరి మూడు వందల చిల్లర.......ఎవరి బ్యాంక్ అక్కౌంట్లు వారికున్నాయి. నా ముష్టి పెన్షన్ డబ్బు ఎవరికి కావాలి? ఇంటి ఖర్చులలో కూడా నయాపైసా అయినా నా డబ్బు పడేందుకు వీల్లేదు. ఈప్రపంచంలో మనిషిమీద గౌరవాభిమానాలు డబ్బునుబట్టే కొంతవరకూ పుట్టుకుని వొస్తూవుంటాయి. నేను ప్రతినెలా పెన్షన్ తీసుకుని వచ్చే దోవలోనే బ్యాంకులో నాపేర జమకట్టి యింటికి వచ్చేస్తాను. ఎవరికైనా డబ్బు కావలసివస్తుందేమో, నా ఆరువేల రూపాయల బ్యాలెన్స్‌లోనుంచి డ్రా చేసి 'షైన్' అవుదామని నాకు మహా కోరికగావుంది. కాని ఆ అవకాశంరానిదే ఏం చేయను? మొన్నటికి మొన్న ఏం జరిగిందనుకున్నారు? మా అమ్మాయితో బుద్ధి పొరపాటున గడ్డితిని ఇలా అన్నాను. "నీకు ఒక నెక్లెసు చేయిద్దామనుకుంటున్నానే అమ్మడూ, నా డబ్బుతో." నా మాటలు విని అది చిత్రంగా చూసి "ఏమిటీ? నెక్లెసా? నాకా? ఇప్పుడా? గోల్డు కంట్రోల్ ఉందని తెలీదూ? బంగారం కొని పెట్టుకోవడం అంటే దేశద్రోహమని అర్థం. నీ కా ఆలోచన వుంటే యింతటితో కట్టిపెట్టు......"అన్నది. దానితో నా నోట మాట రాలేదు.

ఒకనాడు పెన్షన్ డబ్బు బ్యాంకులో జమకడుతూ ఉండగా ఒక ఆలోచన వచ్చింది. విత్‌డ్రాల్ ఫారం తీసుకుని పూర్తిచేసి సంతకం చేసి గుమాస్తాచేతి కిచ్చాను. అతడు నన్ను బాగా

ఎరిగినవాడు. ఒక్కసారిగా తలఎత్తి చూసి, "మూడు వేల రూపాయలా?" అని అడిగాడు. నేను గొప్పగా నవ్వుతూ, "అవునయ్యా! కావలసి వచ్చింది. ఇంట్లో కొన్ని అవసరాలు అనుకోకుండా వొచ్చిపడ్డాయి." అన్నాను. అతడు టోకెన్ యిచ్చాడు. చాలా ఏళ్లతర్వాత మొట్ట మొదటిసారిగా డబ్బు తీసుకోవడంకోసం క్యాష్ క్యాబిన్‌ముందు టోకెన్ చేతిలో ఉంచుకుని గర్వంతో నిలబడ్డాను. తర్వాత అంత డబ్బూ తీసుకుని లాల్చీ జేబులో ఉంచుకుని ఎక్కౌంటు బుక్‌తో యింటికి వచ్చి నిట్టూర్చి కుర్చీలో కూర్చున్నాను. అప్పుడు మావాడు ఎక్కడికో వెళ్లబోతున్నాడల్లేవుంది, ముందు హాల్లోకి వచ్చాడు. నా పిలుపు విని "ఏమిటి నాన్నా?" అంటూ నా దగ్గరికి వచ్చాడు. నేను నిర్లక్ష్యం నటిస్తూ, "అదుగో! ఆ బ్యాంకు పుస్తకంలో నిలవ ఎంత వుందో చూసి చెప్పు, ఒక సారి......" అన్నాను. వాడు పుస్తకం చేతిలోకి తీసుకుని "మూడువేల చిల్లరవుంది...... ఇవాళ మూడువేలు విత్‌డ్రా చేసినట్లున్నది యిక్కడ......" అన్నాడు. వాడు, "అంత డబ్బు ఎందుకు తీసుకున్నారు? ఏ అవసరం వచ్చింది?" అని అడుగుతాడేమో అని ఎదురు చూశాను. కాని, అదేం చిత్రమో, వాడు 'ఎందుకు?' అని అడగనే లేదు. పైగా పుస్తకం అక్కడ పడేసి పోబోయాడు. నాకు ఉన్నట్టుండి చిరాకు పుట్టుకు వచ్చింది. కోపంతో "అవును... మూడు వేలూ తీసుకున్నాను. వూరికే బజారున పోయేవాళ్లను పిలిచి పంచి పెడదామని అనుకుంటున్నాను." అని అరిచాను. నా కేకలు విని చిత్రంగా చూసి భార్యను కేకవేసి పిలిచి "రమా! నాన్నగారికి ముందు కాఫీ యివ్వు...ఎందుకో చిరాగ్గా వున్నారు" అని చెప్పి వెళ్లిపోయాడు. అంతే, మర్నాడే ఆ మూడువేలూ తీసుకుపోయి మళ్లీ బ్యాంకులో జమకట్టి వచ్చాను. ఆ గుమాస్తా నవ్వి అదోలా చూడగా, 'ఆడబ్బుతో అవసరం లేకపోయింది.' అన్నాను. అతడు "అవునుసార్! ఈ డబ్బుతో ఏం పని మీకు? మీ అబ్బాయి ప్రయోజకుడూ, మంచి వాడూనూ. హాయిగా పెద్దతనంలో వాళ్లు మిమ్మల్ని సుఖపెడుతున్నారు.మావాడూవున్నాడు. బి. యస్సీ మూడుసార్లు తప్పికూర్చున్నాడు. ఇక పరీక్షకు కూడా వెళ్లనంటున్నాడు. వెధవ స్నేహాలూ, తిరుగుళ్లూ......ఇంకేంబాగు పడతాడు...." అంటూ తన సొద చెప్పుకు పోయాడు.

*　　*　　*

అయ్యో! ఈ వానరసేన లోపల ఏదో కొంప ముంచింది మళ్లీ......పరుగెత్తుకుంటూ లోపలికి వెళ్లి శిలా ప్రతిమలా నిలబడిపోయాను. అక్కడ ఒక ప్రక్క రాజు చాలా దీక్షతో గ్రామఫోను బాగు చేస్తున్నాడు. ఏ భాగాని కాభాగం విడదీసి నేలమీద పరిచిపెట్టాడు. వాడి తమ్ముళ్లు యిద్దరు మరోప్రక్క కూర్చుని ఖరీదైన పుస్తకాలలో బొమ్మలుచింపి ముక్కలుచేస్తున్నారు. మా రెండో అమ్మాయి సంతానం అయిదేళ్ల పిల్లవాడూ, ఏడేళ్ల పిల్లదీ, కలిసి సబ్బు సగం అరగదీసి నీళ్లలో కలిపి ఏవో పుల్లలతో బుడగలు వూదుతూ గదినంతటినీ వాటితో నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఇందాక ఫోటో అద్దం పగలగొట్టిన కుర్రవెధవ లోపలినుంచి టూత్‌పేస్టు ట్యూబ్ తెచ్చి అంతా పిసికి నేల అంతా ఖరాబుచేసి 'యింకేమి మిగిలివుందా?' అని చూస్తున్నాడు.

చెప్పొద్దూ, నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. కోపం పట్టలేక ఒక్కొక్కళ్లనూ లేవదీసి వీధిలోకి దింపి వచ్చాను. చివరకు రాజు చెయ్యి పట్టుకుని లేవదీసి "నువ్వు కూడా

పద, వెధవా!'' అన్నాను. వాడు నివ్వెరపోం చూస్తూ, ''ఎక్కడికి తాతయ్యా?''అని అడుగ తూనే వున్నాడు. నే నదేమీ వినిపించుకో కుండా వాణ్ణి చేతులలో పనిముట్లతోసహా బర బరా యీడ్చుకుపోతూ ''పెద్దవాడివై వుండి వాళ్లు అంత రచ్చచేస్తూ వుంటే చూస్తూ కూర్చున్నందుకు యిదేశిక్ష నీకు.....''అంటూవీధి లోకి తీసుకుపోయాను. ఆ తర్వాత వీధి తలుపు గడియవేసి పెద్దగా''ఫోండి వెధవల్లారా!ఎట్టైనా ఊరేగండి.....'' అని అరిచాను. వొంటిమీద చొక్కా అయినా లేకుండా కేవలం లాగూలతో ఏడుపు ముఖాలతో నిలబడ్డ యిద్దరు కుఱ్ఱ వెధవలను చూసిన నాకు జాలి కలగలేదు. ముందు హాల్లో కుర్చీలో కూర్చున్న నాకు రాజు వాళ్లందర్నీ సముదాయించి వెంట నడి పించుకుపోవడం కనిపించింది. కాని, ఆకాస్సేపూ నా మనసు రాయి చేసుకున్నాను. అలాగే కొంచెం సేపు కళ్లు మూసుకుని పడుకున్నాను. లోపల ఏమీ సవ్వడిలేదు. ఒక ఒంటరి పిచ్చుక ఏమిటో గొణుగుతున్నది. ప్రక్కయింట్లో రేడియోలో ఏదో పాట వినిపిస్తున్నది.

దాదాపు పది నిముషాల తర్వాత మనసులో ప్రారంభమైన ఆరాటం క్రమంగా అధికం అయింది. వొంటిమీద చొక్కా కూడా లేని ఆ యిద్దరు కుఱ్ఱ కుంకలూ, ఆ చిన్నపిల్లా దాని మెడలో గొలుసూ గుర్తుకు రాగానే ఒక విధమైన భయం కలిగింది. సెలవులకు ఆట విడుపుగా ప్రతిసంవత్సరం యీ వూరికి రావడం, యిక్కడే సెలవులన్నీ గడిపి తిరిగి స్కూళ్లు తెరిచేవేళకు వెళ్లడం చాలా యేళ్ళుగా జరుగు తున్నది. నా చిరాకుకొద్దీ అలా చేశానేగాని, పసి వాళ్లు కోపం తెచ్చుకుని తమ తల్లిదండ్రులతో జరిగింది జరిగినట్టు చెప్పివేసిన పక్షంలో యింకేమయినా వుందా? అల్లుళ్లకూ, కూతుళ్లకూ కోపం ముంచుకురావచ్చు. అప్పుడు వారు ''మేము పిల్లలను సెలవులుకదా అనిష్టలం మార్పుకోసం....అదీ ముసలామె ప్రాధేయపడితే పంపించాముగాని మాకు బరువై కాదు. ఇక్కడ వారికి తిండికీ బట్టకూ లేకనూ కాదు. ఇలా చేశారు కాబట్టి ఇక ఎప్పుడూ పిల్లలను పంపిం చము......మేమూ రాము......'' అని మంకు పట్టు పట్టవచ్చు. అబ్బో! ఆలోచించే కొద్దీ యీ వ్యవహారం ముదిరి చాలా దూరం పోయేట్టుంది.

నేను వెంటనే లేచి యింటి తలుపుకు తాళంవేసి చెప్పులు తొడుక్కుని వరండా మెట్లు దిగి ఆవరణ గేటు తలుపు తీసుకుని రోడ్డుమీదికి వచ్చాను. బయట ఎండ మహా తీవ్రంగా వుంది. సూర్యుడు క్రూరుడైన నియంత వలె సమస్త లోకాన్నీ తన కోటి కోటి కిరణా లతో వేధిస్తున్నాడు. వెచ్చనిగాలి వేగంగా వీస్తు న్నది. పిల్లల జాడ కనుచూపు మేరలో కనిపించ లేదు. ఈ వెధవలెటుపోయారో ఏమో! నాలో ఆదుర్దా ఎక్కువయింది. ఈరాజు గొప్ప ఆరిందాలాగా వాళ్లను ఎటు తోలుకుపోయాడో ఏమో! వాడొక పొగరుబోతు.....

వాళ్లు సాధారణంగా అప్పుడప్పుడు ప్రక్కయిళ్ల పిల్లలతో కలిసి ఆడుకుంటూ వుండటం నాకు తెలుసు. కాని యింత ఎండ వేళ ఆ యిళ్ల తలుపులన్నీ మూసి బలవంతంగా పిల్లలను బంధించివేసి పడుకోబెట్టివుంటారు తల్లులు. ఆ యిళ్లలో ఎక్కడా పిల్లలు ఆవర ణలలో తిరుగుతున్న అలికిడి లేదు. వీధి చివరి దాకా వెళ్లి నేను మళ్లీ వెనుదిరిగి వచ్చాను. మనసులో ఆందోళన మరింత ఎక్కువై పోయింది. గుండెలు దడదడ లాడాయి.

కాని ప్రహరీ తలుపు తీసుకుని లోపల ప్రవేశించిచూద్దునుగదా! వాళ్లు వరసగా సైజుల

వారీగా ప్రహరీగోడ నీడలో కూలబడి వున్నారు. ఫోటో అద్దం పగలగొట్టిన చిన్నవాడు—వీడి పేరు ఎప్పుడూ గుర్తువుండదు నాకు—నోట్లో వ్రేలు వేసుకుని చీకుతూ కూర్చుని వున్నాడు. ఆ ప్రక్కన మరొకడు—వొంటిన చొక్కాలేనివాడు—నా వంక కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తున్నాడు. వాడి పక్కనేవున్న చిన్న పిల్ల నన్ను చూడనట్టు నటిస్తున్నది. మరొకడు చేతిలో బొమ్మతోనే బైటికివచ్చాడు కాబోలు బొమ్మను అటూ యిటూ తిప్పి చూస్తున్నాడు. రాజుమాత్రం ధైర్యంగా "ఎక్కడికి వెళ్లావు తాతయ్యా!" అని అడిగాడు.

నేను కొంచెం కోపంగా "మీ కోసమే. ఎండలో ఎక్కడికి వెళ్లారో అని భయపడ్డాను. అయినా మీరు లోపలి కెలా వచ్చారు?" అని అడిగాను. రాజు నవ్వుతూ "నువ్వు తలుపు దగ్గరికిలాగి వెళ్లావు. మే మీ గోడపక్కనే అవతలవైపు దాక్కుని వున్నామింతసేపూ......" అన్నాడు.

నా మనసు తేలిక పడింది. టూత్‌పేస్టు పిసికి పాడుచేసినవాడివంక చూస్తూ చేతులు చాపాను. వాడు మొహం చింకి చేటంత చేసుకుని ఒక్క ఉదుటున వొచ్చి నా చేతులలో వాలాడు. దానితో అందరిలో హుషారు బయలుదేరింది. బిలబిలలాడుతూ నా వెనకనే వరండాలోకి వచ్చారు. నేను తాళంతీసి అందర్నీ లోపలికి పంపించాను. రాజు వెళ్లీ వెళ్లడంతోనే గ్రామఫోను విడిభాగాలముందు కూర్చుని పని ప్రారంభించాడు. "దీన్ని మరో అరగంటలో 'ఫిట్' చెయ్యాలి" అంటూ.

నేను వెళ్లి మామూలుగా కుర్చీలో కూలబడి పత్రిక చేతిలోకి తీసుకున్నాను. తర్వాత చాలాసేపు అలా చదువుతూ కూర్చుండిపోయాను. లోపల ఆ వానరమూక ఎంత అల్లరి చేస్తున్నప్పటికి పట్టించుకోనేలేదు.

అంతలో ఎండ తగ్గింది. చల్లనిగాలి మళ్లింది. లోపలి రాజు గ్రామఫోను మళ్లీ బిగించినట్టున్నాడు. 'ఆన్ మిలో ప్రీతమ్' అని పాట వినిపిస్తున్నది. "ఈ కుర్రవెధవకు యింత పనివాడితనం వుండటం గొప్ప విశేషమే....." అనిపించింది. అవునుమరి.....వూరికే తిని బలాదూరు తిరిగి చెడిపోకుండా ఏదో వ్యాపకం..... పిల్లల విషయంలో అది మంచిదే......

తలుపు తీసిన చప్పుడు విని తల ఎత్తి చూశాను. మా మూడో అమ్మాయి, కాలేజీలో పరీక్షల డ్యూటీ అయింది కాబోలు, వచ్చేసింది.

"ఏం నాన్నా! ఇవాళ ఉత్తరాలేమన్నా వచ్చాయా?" అని అడిగింది జోళ్ల చప్పుడు చేసుకుంటూ లోపలికి నడిచివెడుతూ.

నాకు వొళ్లుమండింది. కోపంతో తల అడ్డంగా వూపాను. నాకు తెలుసు. వీళ్లు నన్ను కేవలం యింటి కావలి కుక్కలాగా చూస్తున్నారు. మా అమ్మాయి లోపల ఆశ్చర్యంతో "హారి పిడుగుల్లారా! యిల్లంతా ఓకొలిక్కి తెచ్చినట్టున్నారే......" అంటున్నది. తర్వాత కొద్ది క్షణాల్లో మళ్లీ హాల్లోకి వచ్చి కూర్చుని "అమ్మ దగ్గరినుంచీ ఉత్తరంలేదు. ఎప్పుడొస్తుందో ఏమో!" అన్నది పెద్దగా.

నేను కోపంతో "ఆమెగారిప్పట్లో ఎలా వొస్తుందీ? అక్కడివాళ్లే ఆమెకు ముఖ్యం..." అన్నాను. మా అమ్మాయి ఎందుకో నవ్వింది. ఒక్క క్షణం ఆగి మళ్లీ "ఈ కోతులు ఇల్లంతా ఎలా అడివిలా తయారు చేశారో చూశావా" అన్నది.

నేను వెంటనే చిన్న అబద్ధం ఆడేశాను. "నాకేం తెలుసు? పొద్దుననగా ఒక స్నేహితుడి యింటికి వెళ్లి నేనూ యిప్పుడే వొస్తున్నాను. ఇంతసేపూ చదరంగంతోనే సరిపోయింది....... వాళ్లు యిప్పటిదాకా కదలనీయందే....."

కాని లోపలినుంచి పరుగెత్తుకువచ్చిన ఏడేళ్ల కుర్రవెధవ నా పరువు తీశాడు. "కాదు పిన్నీ! తాతయ్య అబద్ధం చెబుతున్నాడు. ఆయన పొద్దుణ్ణించీ ఎక్కడికి కదల్లేదు." అని చెప్పేశాడు.

నేను ముఖం కందగడ్డలా చేసుకుని కూర్చున్నాను. మా అమ్మాయి ఆ విషయం వొదిలేసి నవ్వి లేచి నిలబడి, "ఇక యిల్లంతా బాగు చేసుకోవొద్దూ......పొద్దుగూకుతున్నది." అంటూ లోపలికి వెళ్లిపోయింది. నేను గభాలున వెళ్లి నా పరువు తీసిన ఆ కుర్రగాడిద చెవులు రెండూ పట్టుకుని పిండేశాను. వాడు కొంప మునిగినట్టు ఏడవటం సాగించాడు.

మరికొద్ది సేపట్లోనే స్కూటర్ యింటి ముందు ఆగింది. ముందు కోడలు దిగివచ్చి నన్ను నవ్వుతూ పలకరించి లోపలికి వెళ్లింది. తర్వాత మావాడు తాళం చెవుల గుత్తి గిరగిరా తిప్పుకుంటూ లోపలికి వచ్చాడు. వాడికేం? రాజా. ఇప్పుడు హాయిగా స్నానం చేస్తాడు. చక్కగా చలువబట్టలు కట్టుకుని స్కూటర్ మీద క్లబ్బుకు పోతాడు. అక్కడ ఏవేవో పేపర్లూ పుస్తకాలూ చూసి ఏడున్నర, ఎనిమిది గంటలకల్లా మళ్లీ తిరిగి వచ్చేస్తాడు. అప్పుడు భోంచేసి హాయిగా నిద్రపోతాడు. మా అమ్మాయి తన గదిలో ఏదో చదువుకుంటూ పదిగంటల వరకూ మేలుకునే వుంటుంది. తర్వాత దాని గదిలోనూ లైటు వుండదు. ఇక నా ఒక్కడికే


# ఏకాంకిక రచనల పోటీ

జిల్లాలలో ప్రచారానికి ఉపయోగించే చిన్న ఏకాంకిక రచనల పోటీ ఒకదానిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధ శాఖ నిర్వహిస్తున్నది. ఆధునిక భారతీయ జీవితంలోని ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక విలువలను వ్యక్తంచేస్తూ, వర్తమాన జాతీయ ప్రయోజనాలను ప్రతిబింబింపజేసేవిధంగా ఏకాంకిక ఉండాలి. ఇతివృత్తం సాధ్యమైనంతవరకు ఒకే ప్రధాన అంశానికి సంబంధించినదై ఉండాలి. ప్రచారలక్ష్యం పరోక్షంగాఉండి ఆధునిక సాంఘిక నాటికలమాదిరి కళాత్మకంగాఉండాలి.

1. నాటిక ప్రదర్శన సమయం ఒక గంటకు మించరాదు.
2. పోటీకి రచనను మూడు ప్రతులలో పంపాలి.
3. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎన్నికైన రచనలకు వరుసగా రూ. 500, రూ. 300, రూ. 200 లు ఇవ్వబడుతాయి.
   బహుమతి పొందిన నాటికలపై సర్వ హక్కులు ప్రభుత్వానికి చెందుతవి.

**ఎంట్రీలు అందాల్సిన ఆఖరు తేది : 1966 అక్టోబరు 31 వ తేదీ.**

పోటీకి సంబంధించిన అన్నివిషయాలలోను హైదరాబాదులోని సమాచార, పౌరసంబంధశాఖా డైరెక్టరుదే తుదినిర్ణయంగాఉంటుంది. ఎంట్రీలను ఆయనహోదాపేరపంపాలిగాని ఆయనవ్యక్తిగతపేరునపంపరాదు.

టి. రామచంద్రరావు, డైరెక్టరు.

నిద్రపట్టదు. ఒకవేళ నిద్రపట్టినా అంతలోనే మెలకువ వచ్చేస్తుంది.

లోపల పిల్లమూక అంతా మామయ్య చుట్టూ చేరి ఆనాడు జరిగినదంతా నివేదిక సమర్పించారు. ఆ నివేదిక నిండా నా దుర్మార్గమైన నడవడీ, నా క్రౌర్యమూ తప్ప మంచి ఏమీ లేదు. "తాతయ్య నన్ను కొట్టాడు" అని ఒకడూ, "తాతయ్య మమ్మల్ని కొట్టి యిడ్చుకు వెళ్లి ఎండలో వీధిలోకి తోసేసి తలుపేసుకున్నాడు.." అని ఒకడూ చెబుతున్నారు. మావాడు వింటూ "ఊఁ" కొడుతున్నాడు.

వాడు కొద్ది నిముషాల్లో యివతలికి వచ్చాడు. వాడు యింకా స్నానానికి సిద్ధం కాక పోవడం చూసి "ఇవాళ క్లబ్బుకు వెళ్లవా ఏమిటి?" అని అడిగాను.

వాడు కూర్చుంటూ "లేదు నాన్నా! ఇవాళ స్టేషనుకు వెళ్లాలి. ఒక స్నేహితుడు వొస్తున్నాడు. మధ్యాహ్నం టెలిగ్రాం వచ్చింది" అని చెప్పాడు.

మళ్లీ ఒక్కక్షణం ఆగి "పిల్లలు బాగా అల్లరి చేశారా ఏమిటి? వాళ్లను కొట్టి ఎండలోకి తోసేశావుట.." అని అడిగాడు.

నాకు కోపం ముంచుకుని వచ్చింది. "అవును..వాళ్లేమీ చెయ్యలేదు. అంతా బంగారు తండ్రుల్లాగా కూర్చున్నారు. నేనే దుర్మార్గుణ్ణి.....కొట్టి ఎండలోకి తోసేశాను. సరేనా?.." అని అరిచాను.

మావాడు కొంచెం ఆశ్చర్యపోయి "అదేమిటి నాన్నా! అంత కోపమెందుకు?" అన్నాడు.

నేనింకా రెచ్చిపోయాను. "అవున్నా.... నేను రిటైరయిన ముసలాణ్ణి. ఎవరికీ పనికి రాని వాణ్ణి. అందరూ ప్రయోజకులు కదూ. ఇక నాజోలీ శొంఠీ ప్రమేయమూ ఎవరికి కావాలి.. ఇంటికి కావలికాచే కుక్కలాగా వొదిలిపెట్టి పోతారు. నేను యింటికి కావలి కాస్తూ పడుండాలి.." అని అరిచాను.

మావాడు ఏమీ మాట్లాడకుండా వెళ్లిపోయాడు. అసలు వాడి చిన్నతనంలో నేను వాడికి నేర్పిన మొదటిపాఠం యిదే. "కోపంగా ఉన్నవారితో మాటాడకు. వెంటనే తప్పుకో... వారి కోపం చల్లారిన తర్వాతనే నువ్వు మాట్లాడు.." అని. వాడు దాన్ని బాగా అలవాటు చేసుకున్నాడు.

వాడా విధంగా నా ముందు నుంచీ వెళ్లిపోవడంతో నాకు గొప్ప చిరాకూ, బాధా కలిగాయి. చేతిలో వున్న పేపరు క్రింద విసిరికొట్టి "ఇక యీ యింట్లో అన్నం కూడా ముట్టను నేను...ఇంత అవమానం జరిగాక నాకేనా అభిమానం లేనిది.." అంటూ వెళ్లి ప్రక్క గదిలో కూర్చున్నాను. నా వెనకనే ఎవరో ఒకరు, లేక ఇంటిల్లపాదీ వచ్చి బతిమిలాడి తీసుకుపోతారనే భరోసాతో అడుగుల చప్పుడు కోసం చెవులు రిక్కించుకుని వింటూ వాలుకుర్చీలో కళ్లు మూసుకుని కూర్చున్నాను.

కాని నాకు ఆశాభంగమైంది. ఎంతసేపటికీ ఆ అడుగుల చప్పుడు వినబడలేదు సరిగదా, వాకిట్లో స్కూటరు కదిలి వెళ్లిపోయిన చప్పుడూ, లోపల పనులు చేసుకుంటూ వొదినా మరదళ్లు మాట్లాడుకుంటున్న మాటలూ, రాజు వరసగా పెడుతున్న గ్రామఫోను రికార్డులూ వినబడుతున్నాయి. పిల్లలందరిచేతా వరసగా స్నానాలు చేయించి సముదాయిస్తున్నది మా కోడలు. వుండివుండి ఆమె మెత్తని కంఠస్వరం వినిపిస్తున్నది.

అంతలోనే నాకు నిద్రపట్టింది.

* * *

నాకు మెలకువ వచ్చేసరికి గదిలో వెలుతురేలేదు. చీకట్లో వొంటరిగా కూర్చుండి

పోవలసి వచ్చినందుకు దుఃఖం పొంగివచ్చింది. నా భార్యే వుంటే ఇలా నిరాదరణ పొందే దుర్గతి పట్టేది కాదుగదా అనిపించింది.

కాని లోపలి గదిలో నాకు తెలియని వ్యవహారం ఏదో జరుగుతున్నది. వినీవినగానే, హాయినిచ్చే ఆ కంఠస్వరం ఉండి ఉండి విని పిస్తున్నది. నా శరీరం హఠాత్తుగా పులకరించి నట్లయింది. నెమ్మదిగా లేచి కిటికీలో నుంచి చూశాను.

హాల్లో పెద్దసభ జరుగుతున్నది. అందరి మధ్యా నా భార్య కూర్చుని వున్నది. పిల్లకుంక లందరూ బెల్లం మీదికి ఈగలు ముసిరినట్టు ఆమె మీదికి ఎగబడుతున్నారు. ఆమె అందరినీ పేరు పేరునా పలకరిస్తూ 'మాబాబే' అనీ, 'మా అమ్మే' అనీ సంబరపడిపోతున్నది. మావాడూ, కోడలూ, మా అమ్మాయీ, రాజా అందరూ పెద్దగా మాట్లాడుతున్నారు.

నేను మళ్లీ వెళ్లి ఆ చీకటి గదిలోనే ఆ కుర్చీలో అలాగే కూలబడి కళ్లు మూసు కున్నాను. మనసు తేలిక పడినట్టు అనిపిం చిందేగాని పట్టుదల, రోషం మాత్రం తగ్గ లేదు. అందుకే, రాజు వచ్చి ''తాతయ్యా! అన్నా నికి రమ్మంటున్నారు..'' అని పిలిస్తే ''నేను రానని చెప్పు పో..'' అని కసిరికొట్టి పంపిం చేశాను. ఆ తర్వాత మరొక కుర్రవెధవ వచ్చి ''అబ్బో! అంతా చీకటి...తాతయ్యా! అం తిందాం రా..'' అన్నాడు గుమ్మంలోనే నిలబడి. ''పోరా గాడిదా. మీరందరూ తినండి..నాకేమీ అక్కర్లేదు..'' అన్నాను. వాడు వెళ్లిపోయాడు. ఆ తర్వాత మా కోడలు వచ్చి ''ఇలా చీకట్లో కూర్చున్నారేం మామయ్యా?'' అంటూ లైటు వేసి ''రండి. భోంచేద్దురుగాని..'' అని పిలి చింది. ''నేను రాను... నాకక్కర్లేదు... కడుపు నిండుగా వుంది..'' అన్నాను. ఆమె ఒక్కక్షణం అలాగే నిలబడి తర్వాత వెళ్లిపోయింది.

కొద్ది క్షణాల తర్వాత కొత్త చీరె సవ్వడీ..మల్లెల వాసనా నన్ను ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి చేశాయి. చల్లని గాలితెర వీచినట్టయింది. మరుక్షణంలో నా నుదుట చల్లని గాజుల చేయిపడింది. ఒక్కసారిగా నిలు వెల్లా పులకరించి పోయాను. కళ్లు తెరిచి చూశాను.

నెలల తరబడి చాకిరీ వల్లనూ, ప్రయా ణపు బడలిక వల్లనూ, కొంచెం నీరసంగా కనిపి స్తున్నదామె. ముఖంలో అమృతప్రాయమైన చిరునవ్వు మాత్రం చెక్కుచెదరకుండా అలాగే వుంది. ఒక చేత్తో నుదుట పడుతున్న వెంట్రుకలను పైకి తోసుకుంటూ ''లేవండి బాబా! భోజనాలు కానిచ్చేదాం..'' అన్నది.

నేను ''నాకేమీ అక్కర్లేదు..'' అందా మనుకున్నాను. కాని ఆమె నాకు మరికాస్త దగ్గరగా వచ్చి నా భుజం పట్టుకుని లేవదీసి ''రండి..మీరు రాకపోతే కోడలు కూడా అన్నం మానేస్తుందిట..పరాయి అమ్మ కన్నబిడ్డ..దాన్ని బాధ పెట్టడం ఎందుకు..?'' అన్నది.

నాకు కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆమె చేయి పట్టుకుని నడుస్తూ ''నువ్వు వొస్తు న్నట్టు నాకు రాయక పోయావా? స్టేషను దగ్గరికి వొచ్చేవాణ్ణిగా..'' అన్నాను.

ఆమె నవ్వుతూ ''నాకేం తెలుసు? అల్లుడు పెళ్ళిగ్రాం యిచ్చానని చెబితే యింటికే యిచ్చాడనుకున్నాను. ఆయన కాస్తా బావమరిదికి పెళ్ళిగ్రాం యిచ్చి వచ్చాడని నాకేం తెలుసు....'' అన్నది.

నేను కాళ్లు కడుక్కుని వంట యింట్లోకి అడుగుపెట్టగానే అంతా నిశ్శబ్దంగా

వుంది. పిల్లలందరూ అప్పుడే అన్నాలు తిని హాల్లోకి వెళ్ళిపోయినట్టున్నారు. మావాడు ఒక వైపున గోడ కానుకుని కూర్చుని వున్నాడు. మా అమ్మాయీ, కోడలూ, చెరోవైపూ కూర్చుని వున్నారు.

నేను వెళ్లీ వెళ్ళగానే కంచం ముందు కూర్చుని మా కోడలి వంక తిరిగి "నువ్వు అన్నం మానేయడ మెందుకూ పిచ్చిపిలా? మంచిదానివే.. అందరూ కానివ్వండింక.." అన్నాను.

తర్వాత మావాడి వంక తిరిగి "ఎవరో స్నేహితుడొస్తున్నాడని అబద్ధం చెప్పి వెళ్ళక పోతే నాకు నిజం చెప్పకపోయావురా?" అన్నాను. వాడు నవ్వి వూరుకున్నాడే గాని ఏమీ మాట్లాడ లేదు.

నేను భోజనం ముగించి కబురు ముగించి హాల్లోకి వచ్చేసరికి సరిగ్గా తొమ్మిది కొట్టింది. పిల్లలందరూ అప్పటికే పరుపుమీద పడుకుని నిద్రపోతున్నారు. వాళ్ల దగ్గర కొద్దిక్షణాలు కూర్చున్నాను. పిచ్చి వెధవలు. ప్రొద్దుటి నుంచీ ఎంత అల్లరిచేశారు!

మా కోడలు వచ్చి "మామయ్యా! ఇటు వరండాలో మీకు మామూలుగా వేసే చోటనే పక్కవేశాను. వెళ్లి పడుకోండి...." అన్నది.

నేను మా ఆవిడ వైపు చూశాను. ఆమె ఎవరూ చూడకుండా "వస్తాను.. వెళ్ల మ"ని నా వంక తిరిగి సైగ చేసింది. నేను హాయిగా గాలిలో తేలిపోతున్నట్టు అడుగులు వేస్తూ వరండాలోకి వెళ్లాను. నా మంచం పక్కనే చాప ఒకటి వేరే పరిచి వుంది.

నేను పక్కమీద వాలిపోయాను. చల్లని సముద్రపు గాలి తెరలు తెరలుగా వీస్తున్నది. ఎక్కడో చెట్టు గుబురులో దాగివుండి కోయిల ఒకటి కూస్తున్నది. నక్షత్రాలు నల్లని ఆకాశంలో మినుకు మినుకుమని వజ్రపుముక్కల వలె మెరుస్తున్నాయి. రాత్రి వేళల విహరించే ఏదో పేరు తెలియని పక్షి 'రివ్వు'న ఎగిరి పోతూ 'క్రీక్' మని అరుస్తున్నది.

నా ప్రక్కనే అడుగుల సవ్వడి.., ఆ క్రొత్త చీరె జరజర. ఆ సిగలోని మల్లెల సుగంధం.., ఆ చల్లని ఆప్యాయత కురిపించే చూపులు.., ఎండవేళ విశ్రాంతి నిచ్చి సేదదీర్చే చల్లని గన్నేరు నీడవంటి మంచి మనసు... నిద్రాదేవత కమ్మగా నవ్వుతూ మమ్మిలను తన వొడిలోకి తీసుకున్నది. ఆ అమృత పరిష్వంగంలో అలాగే కమ్మగా నిద్రపట్టింది.

